## ‘బ్రాహ్మణ పరిషత్’కు బకాయి 70కోట్లు

- విదేశాల్లో 280మంది విద్యార్థుల తిప్పలు
- మరో 200మంది ఎదురుచూపులు
- ‘బెస్ట్’ లబ్ధిదారులకూ అందని చెక్కులు
- మరో 1500 దరఖాస్తులు పెండింగ్
- ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తులు



హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంపై నమ్మకంతో ఎన్నో ఆశలు పెట్టుకొని విదేశాల్లో చదువు కోసం వెళ్లిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ‘తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్’లో ప్రధానంగా ‘వివేకానంద విదేశీ విద్యా’ పథకం, ‘బ్రాహ్మిణ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ స్కీమ్ ఆఫ్ తెలంగాణ (బెస్ట్)’ పథకాలకు రూ.70కోట్ల బకాయిలు పెండింగులో ఉండడంతో అటు విద్యార్థులు, ఇటు చిరు వ్యాపారులకు నానా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విదేశీ విద్యా పథకం కింద ఎంపికైన విద్యార్థులు ఆయా యూనివర్సిటీల్లో ఫీజులు చెల్లించి ప్రవేశాలు పొందితే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా ప్రభుత్వం ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.20లక్షల చొప్పున రీయింబర్స్‌మెంట్ ఇస్తుంది. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం వివేకానంద విదేశీ విద్యా పథకం కింద 280 మంది ఎంపికయ్యారు. వీరికి అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం మంజూరు పత్రాలు కూడా ఇచ్చింది. మరో 200మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు పూర్తికాగా వారికి మంజూరు పత్రాలు అందలేదు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో మంజూరైన విద్యార్థులకు నిధులు, ఇంటర్వ్యూలైన విద్యార్థులకు మంజూరు పత్రాలు నిలిచిపోయాయి. ఈలోగా లబ్ధిదారులు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో స్వల్పకాల రుణాలు తీసుకొని యూనివర్సిటీల్లో ప్రవేశాలు పొందారు. ఎన్నికలయ్యాక నిధులు వస్తాయనుకుంటే ఇప్పటికీ ప్రభుత్వం విడుదల చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ పాలకమండలిని రద్దుచేసింది. ఆరు నెలలవుతున్నా ఇప్పటికీ కొత్త పాలకమండలిని నియమించలేదు.

### విదేశాల్లో బాధలు వర్ణనాతీతం

మంజూరు పత్రాలు వచ్చినవారికి సుమారు రూ.50కోట్ల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో అప్పుచేసి విదేశాలకు వెళ్లిన 280మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చాలామంది విద్యాభ్యాసంతోపాటు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నా వచ్చే ఆదాయం అక్కడి ఖర్చులకే సరిపోవడంలేదని వారి తల్లిదండ్రులు చెబుతున్నారు. ఫైనాన్స్ సంస్థల వేధింపులు పెరిగిపోవడంతో తమ పిల్లలు విద్యను సరిగా కొనసాగించలేకపోతున్నారని, మానసికంగా కుంగిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరోవైపు, ఇంటర్వ్యూలు పూర్తయిన 200మంది అభ్యర్థుల పరిస్థితి కూడా ఇలాగే ఉన్నది.

### ఇరకాటంలో ‘బెస్ట్’ లబ్ధిదారులు

పేద బ్రాహ్మణుల స్వయం ఉపాధి కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం బెస్ట్ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సుమారు 400మంది ఈ పథకం కింద ఎంపికయ్యారు. మరో 1500దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. 400మంది లబ్ధిదారులకు రూ.20కోట్ల దాకా సహాయం అందాల్సి ఉన్నది. నిధులు వస్తాయన్న ఆశతో అప్పు చేసి వ్యాపారాలు పెట్టుకున్నవారు ఆరు నెలలు దాటినా నిధులు రాక వడ్డీలు కట్టలేక ఇరకాటంలో పడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందేదని, అదే ఆశతో తాము అప్పుచేసి వ్యాపారాలు పెట్టుకొని ఇప్పుడు ఇబ్బందుల్లో పడ్డామని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## 7వేల కోట్ల ఫీజు బకాయిలు చెల్లించండి

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య**

హైదరాబాద్, జూన్12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రూ.7వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సత్వరమే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయని వివరించారు. విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని, సత్వరమే ఆ నిధులను విడుదల చేయాలని కోరారు. భట్టిని కలిసిన వారిలో బీసీ సంఘాల నేతల్లో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, అంజి, రాజేందర్, వేముల రామకృష్ణ, రఘుపతి, పర్వతాలు తదితరులు ఉన్నారు.

# బాబు డైరెక్షన్‌లో రేవంత్

**ఆ ఐదు గ్రామాలను తిరిగి వెనక్కి తీసుకొనిరావాలి**

- ఆదిత్యనాథ్‌దాస్ నియామకాన్ని రద్దు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్
- ధాన్యం, బియ్యం కుంభకోణంలో రేవంత్ పాత్ర: పెద్ది సుదర్శన్‌రెడ్డి



బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, బైకని శ్రీనివాస్

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం చంద్రబాబు డైరెక్షన్‌లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నడుస్తున్నారని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు. ఇందులో భాగంగానే ఏపీ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన ఆధిత్యనాథ్‌దాస్‌ను రాష్ట్ర నీటిపారుదల శాఖ సలహాదారుగా నియమించారని విమర్శించారు. ఈ నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. బుధవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పదేండ్ల తర్వాత తెలంగాణపై చంద్రబాబు, రేవంత్ కలిసి కుట్రలు మొదలుపెట్టారని దుయ్యబట్టారు. తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ నాడు బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర బంద్ పాటించిందని, కానీ, రేవంత్‌రెడ్డి ఒక్కమాట కూడా మాట్లాడలేదని చెప్పారు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నవిధంగా ఏపీలో విలీనం చేసిన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని డిమాండ్ చేశారు. భద్రాచలం రూరల్ మండలంలోని ఏటపాక, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల, పిచ్చుకలపాడు పంచాయతీలను తెలంగాణలో కలిపే విధంగా రేవంత్‌రెడ్డి కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై, కేసీఆర్‌పై కమిషన్లను నియమిస్తూ, కాంగ్రెస్ మంత్రులు మాత్రం కమీషన్లు తీసుకుంటున్నారని మండిపడ్డారు. సింగరేణి బొగ్గు గనులను వేలం వేయకుండా సింగరేణి సంస్థకు కేటాయించాలని కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. కిషన్‌రెడ్డి చొరవ తీసుకొని సింగరేణి కార్మికులకు ఐటీ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. తెలంగాణ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటులో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

### ఆ కుంభకోణంలో సీఎంకు పాత్ర: పెద్ది సుదర్శన్‌రెడ్డి

సివిల్ సప్లై కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డి పాత్ర ఉన్నదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై త్వరలోనే సివిల్ సప్లై భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధాన్యం, బియ్యం కొనుగోళ్లలో సీఎం రేవంత్‌రెడ్డికి వాటాలు లేకుంటే దానిపై ఎందుకు స్పందించడంలేదని నిలదీశారు. రేవంత్‌రెడ్డి పౌరసరఫరాల శాఖపై ఎందుకు సమీక్ష చేయడం లేదని ప్రశ్నించారు. ధాన్యం టెండర్లు దక్కించుకున్న కంపెనీలకు మరో రెండు నెలల గడువు పెంచినట్టుగా సమాచారం ఉన్నదని, ఆ వివరాలను బయటికి రానివ్వడంలేదని, మీడియాను కూడా పౌరసరఫరాలశాఖ కార్యాలయంలోకి అనుమతించడంలేదని చెప్పారు. సమావేశంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్‌యాదవ్, సిరిసిల్ల జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.



## నాడు సంరక్షణ.. నేడు నరికివేత

**సిద్దిపేట జిల్లా ములుగు, వంటిమామిడిలో చెట్ల తొలగింపు**

ములుగు, జూన్ 12: బీఆర్‌ఎస్ ప్రభుత్వం భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలని హరితహారం కింద మొక్కలు పెంచి సంరక్షిస్తే.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నిర్దాక్షిణ్యంగా నరికేస్తున్నది. సిద్దిపేట జిల్లాలో రాజీవ్ రహదారి వెంట వేలాది మొక్కలను నాటగా వృక్షాలుగా ఎదుగుతున్నాయి. సిద్దిపేట జిల్లా ములుగు, వంటిమామిడి మధ్యలో రాజీవ్ రహదారికి ఇరువైపులా పెరిగిన 20 చెట్లను అధికారులు నరికేశారు. విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్న కొమ్మలను తొలిగిస్తే పోయేదానికి పూర్తిగా చెట్టునే నరికి పర్యావరణానికి విఘాతం కలిగించారు. మొక్కలు నాటాలని చెప్పాల్సిన ప్రభుత్వం, అధికారులు అడ్డగోలుగా చెట్లను నరికివేయించడంతో ప్రయాణికులు ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

## ఎన్టీపీసీలో సమ్మెలపై నిషేధం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ) : నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్టీపీసీ)లో ఆరు నెలల పాటు సమ్మెలపై నిషేధం విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నెల 14 నుంచి ఆరు నెలల పాటు ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ఇంధన ముఖ్య కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పెండింగ్ పనులను పూర్తి చేయాలి: ప్రిన్సిపల్ సెక్రటరీ

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్ అధికారులను ఆదేశించారు. మారుమూల ప్రాంతాల్లో రోడ్ కనెక్టివిటీపై పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, అటవీశాఖల సంయుక్త సమీక్షా సమావేశాన్ని బుధవారం ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష తీవ్రవాద ప్రాబల్యప్రాంతాల్లో (ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూఈ) రోడ్ల విస్తరణ పథకం కింద చేపట్టిన 61 పనులు, పీఎంజీఎస్‌వై కింద చేపట్టిన 51 పనులపై సమీక్షించారు. సమావేశంలో పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియల్, పీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) ఎంసీ పర్గేన్, ఆర్అండ్‌బీ కార్యదర్శి విజయేంద్రబోయి, జాయింట్ సెక్రటరీ హరీశ్, ఈఎన్సీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

## స్థానిక సంస్థలపై కర్ణాటక బృందం అధ్యయనం

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యాలయంలో సంస్థ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అధ్యక్షతన బుధవారం కర్ణాటక రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ నారాయణస్వామి నేతృత్వంలోని బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల పనితీరు, ఆర్థిక స్థితిగతులపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యకార్యదర్శి స్మితాసబర్వాల్, సభ్యులు సంకేపల్లి సుధీర్‌రెడ్డి, మాలోత్ నెహ్రూ నాయక్, రమేశ్ పాల్గొన్నారు.

## మత్స్య, పశుసంవర్ధక శాఖ కార్యదర్శిగా సబ్యసాచి ఘోష్

హైదరాబాద్, జూన్ 12(నమస్తే తెలంగాణ): మత్స్య, పశుసంవర్ధక, ముఖ్య కార్యదర్శి(ఎఫ్ఏసీ)గా సబ్యసాచి ఘోష్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత కార్యదర్శి అధర్‌సిన్హా పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో ఘోష్‌ను నియమించారు.

## లేబర్ కోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేం

**టాటా బోయింగ్ ఏరోస్పేస్ కేసులో హైకోర్టు స్పష్టీకరణ**

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ సంస్థలో కార్మికుల తొలగింపు వివాదానికి సంబంధించి 2021 ఫిబ్రవరిలో లేబర్ కోర్టు జారీ చేసిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు నిరాకరించింది. తమను ఉద్యోగాల నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ ఆ సంస్థ కార్మికులు దాఖలు చేసిన పిటిషన్లకు అదనపు సాక్ష్యాధారాలను, పత్రాలను జోడించేందుకు లేబర్ కోర్టు అనుమతి ఇవ్వడాన్ని సమర్థించింది. లేబర్ కోర్టు ఆదేశాలు చట్టబద్ధంగానే ఉన్నాయని స్పష్టం చేసింది. అదనపు ఆధారాలపై వివరణ ఇచ్చే అవకాశం టాటా బోయింగ్ ఏరోస్పేస్ సంస్థకు ఉన్నందున లేబర్ కోర్టు నిర్ణయం సరైనదేనని తేల్చిచెప్పింది. లేబర్ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఆ సంస్థ దాఖలు చేసిన 38 పిటిషన్లను కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ పీ మాధవీదేవి బుధవారం తుది ఉత్తర్వులు జారీ చేశారు.

## రోడ్డు ప్రమాద కేసులో అక్రమంగా ఇరికిస్తున్నారు

**ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో రహీల్ అమీర్ పిటిషన్**

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండేళ్ల క్రితం నమోదైన రోడ్డు ప్రమాద కేసులో తనను అక్రమంగా ఇరికిస్తున్నారని, రాజకీయ కక్షలే ఇందుకు కారణమని పేర్కొంటూ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ కుమారుడు రహీల్ అమీర్ హైకోర్టును ఆశ్రయించారు. 2022 మార్చి 17న నమోదైన ఈ కేసులో పోలీసులు ఇప్పుడు తనను అరెస్టు చేసే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తాను ఎక్కడికీ పారిపోయే అవకాశాలు లేవని, తమ ఆస్తులన్నీ ఇక్కడే ఉన్నాయని ఆ పిటిషన్‌లో తెలిపారు.

# రైతుభరోసా తక్షణం అమలు చేయాలి

**రైతుబీమా ఉంటుందా? ఎత్తేస్తరా? స్పష్టత ఇవ్వాలి**

- రైతుకూలీలకు రూ.12,000, కౌలు రైతులకు రూ.15,000 ఇవ్వడంపైనా తేల్చి చెప్పాలి
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): ఈ వానకాలం నుంచే రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.7,500 అందజేయాలని మాజీ వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇంతకీ రాష్ట్రంలో రైతుకు ‘భరోసా’ ఉన్నట్టా? లేనట్టా? అని ప్రశ్నించారు. రైతుభరోసా విధివిధానాల రూపకల్పనకు ఏడు నెలల నుంచి ముఖ్యమంత్రి, మంత్రులకు తీరికలేదా? అని నిలదీశారు. ఏ పథకం గురించి అడిగినా ముఖ్యమంత్రి, మంత్రులు ‘ఓ స్త్రీ రేపురా’ అని రాసి ఉండే కథను వినిపిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఎన్నికల ప్రచారంలో ఉన్న సోయి విధివిధానాల రూపకల్పనలో లేదని మండిపడ్డారు. రైతుభరోసా విషయంలో రైతుబంధు పథకాన్ని సమీక్షిస్తామనిగానీ, కుదింపు చేస్తామనిగానీ కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ఎందుకు చెప్పలేదని బుధవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు.

### దమ్ముంటే విధాన ప్రకటన చేయాలి..



*‘రైతుభరోసాకు దిక్కు లేదు. కౌలు రైతుల ఊసులేదు. రైతు కూలీల గురించి పట్టించుకున్న నాథుడే లేడు. వరికి రూ.500 బోనస్ వట్టి బోగస్ అని తేలిపోయింది’ అని నిరంజన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే రైతుభరోసాను 5 ఎకరాలకో, 10 ఎకరాలకో పరిమితం చేస్తామని విధాన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కాలయాపన కోసమే శాసనసభ సమావేశాలు అంటూ ఊదరగొడుతున్నదని విమర్శించారు. రైతుభరోసా విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని సూచించారు. రైతుబీమా ఉంచుతారా? ఎత్తేస్తారా? తేల్చి చెప్పాలన్నారు. రైతుకూలీలకు రూ.12,000, కౌలు రైతులకు రూ.15,000 ఇవ్వడంపై స్పష్టతనివ్వాలని, అబద్ధపు హామీలతో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ రాష్ట్ర రైతాంగాన్ని నిలువునా ముంచుతున్నదని ఆరోపించారు.*

## లోకల్ టెండర్లకు బ్రేక్

ఏటూరునాగారం, జూన్ 12 : ఐటీడీఏల పరిధిలోని గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లకు నిత్యావసర సరుకులు, కాస్మోటిక్స్ సరఫరా కోసం గిరిజన సహకారం సంస్థ (జీసీసీ) ద్వారా నిర్వహిస్తున్న టెండర్లకు గిరిజన సంక్షేమ శాఖ బ్రేక్ వేసింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 25 వేల మందిపైగా గిరిజన విద్యార్థులకు సరఫరా చేసేందుకు ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో మూడు నెలలకోసారి టెండర్లను పూర్తిచేసి వ్యాపారుల నుంచి సేకరించిన సరుకులను జీసీసీ సరఫరా చేస్తున్నది. ఇందుకు 5 శాతం వరకు జీసీసీ కమీషన్ పొందుతున్నది. ఈ ఏడాది నుంచి రాష్ట్ర స్థాయిలో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు గిరిజన సంక్షేమశాఖ ఆదేశాలు జారీ చేయడంతో జీసీసీ టెండర్లు నిర్వహించలేదు. దీంతో పాఠశాలలు తెరుచుకున్నప్పటికీ సరుకులు సరఫరా కాలేదు. అటు రాష్ట్ర స్థాయి కొనుగోలు కమిటీ ద్వారా ఎవరెవరు ఏమేమి సరఫరా చేయాలనేది నిర్ణయించినప్పటికీ ఆచరణలో జాప్యం కావడంతో సరుకుల సరఫరాకు మోక్షం లభించలేదు.

## సాగుకు నీళ్లియ్యక తప్పు చేసిన కాంగ్రెస్

**హామీలు మరిచి గత సర్కార్‌పై నిందలా?**

- కమిషన్ల విచారణ పేరుతో లీకుల డ్రామాలు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట టౌన్, జూన్ 12 : కాళేశ్వరాన్ని నింపి సాగునీరు అందించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద తప్పు చేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన సూర్యాపేటలోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. పాలకులు నాలుగు నెలలుగా సమయం వృథా చేసి.. ఇప్పుడు హడావిడి చేస్తున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ లోపాలంటూ ఆరోపణలను రాజకీయాల కోసం వాడుకుంటున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అధికారం చేపట్టి ఆరు నెలలైనా కాంగ్రెస్ పార్టీ హామీల అమలు మరిచి గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ పబ్బం గడుపుతున్నదని విమర్శించారు. నీళ్లు, విద్యుత్తు విషయంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, ప్రజలు మంచి నీళ్ల కోసం మళ్లీ రోడ్డెక్కే పరిస్థితి కనిపిస్తున్నదని పేర్కొన్నారు. పత్తి విత్తనాల బ్లాక్ దందాలో ఓ మంత్రి పాత్ర ఉన్నదని.. ఆధారాలు రాగానే పూర్తి వివరాలు ప్రజలకు వెల్లడిస్తామని తెలిపారు. ప్రభుత్వ చేతగానితనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఎన్ని కమిషన్లు వేసినా అభ్యంతరం లేదని, కమిషన్ల విచారణ కంటే మీడియా లీకులే ఎక్కువయ్యాయని ఆరోపించారు. కమిషన్ల విచారణ పేరుతో రైతు రుణ మాఫీపై దృష్టి మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నదని దుయ్యబట్టారు.

## బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు

- బీఆర్‌ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు లలితారెడ్డి, జక్కుల లక్ష్మణ్ ఆగ్రహం



వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాదులు లలితా రెడ్డి, జక్కుల లక్ష్మణ్‌లు

చిక్కడపల్లి, జూన్ 12: బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, సోషల్‌మీడియా ఫాలోవర్స్‌పై పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని ఆ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు లలితారెడ్డి, జక్కుల లక్ష్మణ్ ఆరోపించారు. వివిధ అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో డిజిటల్ మీడియా డైరెక్టర్‌గా ఉన్న కొణతం దిలీప్‌పై ఆర్టీసీ ఫేక్ లోగో విషయంపై చిక్కడపల్లి ఠాణాలో కేసు నమోదుచేశారు. ఈ కేసులో హైకోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్ కాపీని న్యాయవాదులు సీఐ సీతయ్యకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది లలితారెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ట్రాఫిక్ మేనేజర్ శ్రీధర్ ఫిర్యాదు మేరకు నిజాలు తెలుసుకోకుండా కొణతం దిలీప్‌పై కేసు నమోదు చేశారని తెలిపారు. దిలీప్ ఆ లోగోను క్రియేట్ చేశారని ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారని, ఆరోపణలో నిజం లేదని తేలిందని పేర్కొన్నారు. గతంలో కూడా ఇలాగే దిలీప్‌పై, బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్‌పై అక్రమ కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. న్యాయవాది జక్కుల లక్ష్మణ్ మాట్లాడుతూ.. పోలీసుల దర్యాప్తులో ఆర్టీసీ లోగోను దిలీప్ క్రియేట్ చేసినట్టుగానీ, పోస్టు చేసినట్టుగానీ తేలలేదని స్పష్టంచేశారు.

## ఏసీబీకి దొరికిన అసిస్టెంట్ కమాండో

అలంపూర్, జూన్ 12 : లంచం తీసుకుంటూ పదో బెటాలియన్ అసిస్టెంట్ కమాండో ఏసీబీకి పట్టుబడిన ఘటన జోగుళాంబగద్వాల జిల్లాలో జరిగింది. ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ కథనం మేరకు.. ఎర్రవల్లి మండలం బీచుపల్లి 10 బెటాలియన్‌లో గోవర్ధన్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. తనకు అనుకూలంగా క్లియరెన్స్ సర్టిఫికెట్ రిపోర్ట్ ఇవ్వడానికి కేసులో విచారణాధికారిగా ఉన్న అసిస్టెంట్ కమాండో నరసింహస్వామిని సంప్రదించగా రూ.50 వేలు లంచం డిమాండ్ చేశాడు. కమాండో సూచనమేరకు ఆయన స్నేహితుడు, ఏపీలోని కర్నూల్‌కు చెందిన రిటైర్డ్ ఏఆర్ ఎస్సై అబ్దుల్ వహబ్‌కు బుధవారం ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తాలో నగదు అందజేస్తుండగా.. ఏసీబీ డీఎస్పీ పట్టుకున్నారు. నరసింహస్వామి, అబ్దుల్ వహబ్‌ను అదుపులోకితీసుకొని విచారణ జరుపుతున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

# నూతన న్యాయ చట్టాల అమలు ఆపండి

**పోలీసులకు అపరిమిత అధికారాలు ప్రమాదకరం**

**హిందీ పేర్లు పెట్టడం రాజ్యాంగ, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం**

**చట్టాల రూపకల్పనలో సమగ్ర సంప్రదింపులు జరగలేదు**

**కేంద్రానికి బీఆర్‌ఎస్ నేత వినోద్‌కుమార్ లేఖ**

*హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): భారతీయ న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భారతీయ న్యాయ సంహిత–2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత–2023, భారతీయ సంహిత–2023 చట్టాల అమలును నిలిపివేయాలని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మూడు చట్టాలను జూలై 1 నుంచి అమలు చేయాలన్న నిర్ణయాన్ని నిలిపివేయకపోతే కోర్టును ఆశ్రయిస్తానని స్పష్టంచేశారు. ఈ మేరకు బుధవారం ఆయన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌కు లేఖలు రాశారు. కొత్త చట్టాలకు హిందీ పేర్లు పెట్టడాన్ని వినోద్‌కుమార్ తప్పుబట్టారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 348 ప్రకారం చట్టాలను కచ్చితంగా ఇంగ్లిష్‌లోనే డ్రాఫ్ట్ చేయాల్సి ఉంటుందని గుర్తుచేశారు. హిందీ పేర్లు పెట్టడం రాజ్యాంగ ఉల్లంఘన మాత్రమే కాకుండా, హిందీయేతర రాష్ట్రాలకు ఇబ్బందులు కలిగిస్తుందని, ఇది ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. చట్టాల పేర్లను కచ్చితంగా ఇంగ్లిష్‌లోకి అనువదించి, దేశ ప్రజలందరికీ అర్థమయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మూడు చట్టాలు న్యాయ వ్యవస్థతో సంబంధం ఉన్న అనేక రంగాలపై, సామాన్య ప్రజలపై తీవ్రమైన ప్రభావం చూపిస్తాయని తెలిపారు. కొత్త చట్టాలను రూపొందించే క్రమంలో సంబంధిత వర్గాలతో సంప్రదింపులు సరిగా జరగలేదని అభ్యంతరం వ్యక్తంచేశారు. కొత్త చట్టాల ద్వారా పోలీసులకు అపరిమిత అధికారాలు ఇవ్వడం, సంకెళ్లను వాడటం, డిటెన్షన్ సమయాన్ని పొడిగించడం వంటివి దుర్వినియోగం చేసే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. డిజిటల్ ఆధారాలను పరిగణనలోకి తీసుకొనే విషయంలో వ్యక్తిగత డాటా గోప్యతపై ఆందోళనలు రేకెత్తిస్తున్నాయని చెప్పారు. ఈ చట్టంలో సరైన జ్యుడీషియల్ పర్యవేక్షణ లేకుండానే లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలకు మోతాదుకు మించి అధికారాలు కట్టబెట్టారని పేర్కొన్నారు. ఇది ఏకపక్షంగా అరెస్టులు, డిటెన్షన్లు వంటివాటికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు.*



### మరోసారి సమీక్షించండి

*కొత్త చట్టాలకు హిందీ పేర్లు పెట్టడంపై కేరళ హైకోర్టులో ఇప్పటికే ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైందని వినోద్‌కుమార్ గుర్తుచేశారు. న్యాయ మంత్రిత్వ శాఖ తీసుకున్న ఈ నిర్ణయం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళా హక్కులు, కస్టడీలో వేధింపులు వంటి ముఖ్యమైన అంశాల్లో ఈ చట్టాలు పరిష్కారం చూపడం లేదని స్పష్టంచేశారు. ప్రభుత్వం కొత్త చట్టాలను మరోసారి సమీక్షించి మరింత సమగ్రంగా, సరైన పద్ధతిలో సంస్కరణలు చేయాలని కోరారు. ఈ చట్టాలను 2020లోనే అమలు చేయాలని భావించినా, ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తీసుకున్నారని గుర్తుచేశారు.*

## గురుకులాలను కాపాడుకుందాం

- బీఆర్‌ఎస్వీ ఉపాధ్యక్షుడు తుంగబాలు



హైదరాబాద్, జూన్ 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గురుకుల పాఠశాలలను నిర్లక్ష్యం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నించటం దారుణమైన చర్య అని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు అన్నారు. వెయ్యికి పైగా గురుకులాలను నెలకొల్పి దేశంలోనే ఆదర్శవంతమైన విద్యావ్యవస్థకు కేసీఆర్ బాటలు వేస్తే కాంగ్రెస్ సర్కారు వాటిని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ గురుకులాలని అద్భుతంగా తీర్చిదిద్దితే, సీఎం రేవంత్‌రెడ్డి గురుకులాలు సామాజిక రుగ్మతలకు కారణమవుతున్నాయని భావించి, ఆ వ్యవస్థనే నిర్వీర్యం చేసేలా వ్యాఖ్యానించడం సమంజసం కాదని పేర్కొన్నారు. గురుకులాలలో చదువుకునే విద్యార్థులు విషాహారంతో చనిపోతున్నా రేవంత్‌రెడ్డి సర్కారు పట్టించుకోవటం లేదని ఆయన విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు చదువుకొని ఎక్కడ బాగుపడతారోనని సీఎం భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. గురుకులాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉన్నదని తెలిపారు. మహత్తర ఆశయంతో నెలకొల్పిన గురుకుల వ్యవస్థను సీఎం రేవంత్‌రెడ్డి బలహీనపరిచే చర్యని మానుకోవాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు.